సాక్షి
మంచిర్యాల
సోమవారం ၊ 14 ၊ ఆగస్టు ၊ 2023



అడ్డొస్తున్నారని అంతం!
మానవత్వం మంటగలుస్తోంది.. మానవ సంబంధాలు 'మనీ' చుట్టూ తిరుగుతున్నాయి. ఆస్తి కోసం క్షణికావేశంలో అయిన వారినే కడతేరుస్తున్నారు. 8లో▸



ఆర్కే–1ఏ మూసివేతకు కారణాలెన్నో..! 10లో▸
మరో ఏడెనిమిదేళ్ల బొగ్గు నిల్వలు ఉన్నా.. సింగరేణి యాజమాన్యం ఆర్కే–1ఏ గనిని మూసివేసింది.

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /26.3

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లబడుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏబీపీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాస్

మంచిర్యాలఅర్బన్‌: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచారసభ (ఏబీపీపీ)జాతీయ కార్యవర్గసభ్యుడిగా మంచిర్యాల జిల్లాకు చెందిన కొండ శ్రీనివాస్ ఎన్నికైనట్లు ఏబీపీపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్ తెలిపారు. విశాఖపట్నంలో ఏబీపీపీ జాతీయ జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. వివిధ రాష్ట్రాలకు చెందిన సభ్యులు హాజరయ్యారు. జాతీయ అధ్యక్షుడిగా అయ్యప్పదాస్‌తోపాటు నూతన కార్యవర్గం నియమించారు. జిల్లా నుంచి జాతీయ కార్యవర్గసభ్యుడిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

15న దివ్యాంగులకు బస్సుపాస్‌ల పంపిణీ

మంచిర్యాలఅర్బన్‌: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో ఈనెల 15న దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ చేయనున్నట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. స్నేహ ఫౌండేషన్ నిర్వాహకుడు కేవీ.ప్రతాప్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్సుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ, చుట్టుపక్కల ప్రాంత దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం



విజేతగా నిలిచిన జట్టుతో అదనపు కలెక్టర్ బి రాహుల్, డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్

నస్పూర్‌: విధి నిర్వహణలో పని ఒత్తిడితో అలసిపోయిన ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడలతో ఉపశమనం, మానసిక ఉల్లాసం కలుగుతుందని అదనపు కలెక్టర్ బి.రాహుల్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఐడీవోసీ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌తో కలిసి విజేతగా నిలిచిన పోలీస్ శాఖ జట్టుకు, రన్నరప్‌గా నిలిచిన మున్సిపల్ శాఖ జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వం కలుగుతుందని తెలిపారు. పని ఒత్తిడి నుంచి ఉద్యోగులకు ఉపశమనం కలిగించడానికి ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలుశాఖల ప్రభుత్వ అధికారులు, మున్సిపల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో సత్సంబంధాలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయమూర్తి ప్రభాకరరావ్

మంచిర్యాలక్రైం: క్రీడాలతో సత్సంబంధాలు ఏర్పడుతాయని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ పాఠశాలలో న్యాయవాదులకు ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆ యన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయవాదులు నిత్యం కోర్టు పనుల్లో నిమగ్నమై ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. మూడు జట్లు పాల్గొనగా సురేందర్ ఉపాధ్యాయ టీం విజేతగా నిలిచింది. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఆర్పితరెడ్డి, ముకేష్ కుమార్, అజయ్ ఉల్లం, బార్ అసోసియేన్ అధ్యక్షుడు సత్తయ్య న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎందుకీ మీనమేషాలు!

- జలమున్నా జలపుష్పాలు వదలని అధికారులు
- ఈ ఏడాది 2.20 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యం
- 371 చెరువులు, కుంటలు, రిజర్వాయర్ల ఎంపిక
- చేపపిల్లల కోసం మత్స్యకారుల నిరీక్షణ
- అదును దాటాక వదిలితే ఎదగవని ఆవేదన..

ఈ ఏడాది చేపపిల్లల లక్ష్యం 2.20 కోట్లు
చెరువులు, కుంటలు 371
రిజర్వాయర్లు 08
ఉత్పత్తి లక్ష్యం 20 వేల టన్నులు
మత్స్యకార సంఘాలు 117
సభ్యులు 6,542 మంది



మంచిర్యాలఅగ్రికల్చర్‌: జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జలాశయాలన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. కానీ, జలాశయాల్లో మత్స్యకారులకు సిరులు కురిపించే జలపుష్పాలను వదలడం లేదు. చేపల పెంపకానికి సరిపడా వర్షాలు ఇప్పటికే కురిశాయి. చేప పిల్లలను వదిలితే వేసవి నాటికి మంచి సైజుతో మత్స్యకారుల చేతికి దిగుబడి వచ్చి మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉంది. గతంలో సెప్టెంబర్‌లో చేపపిల్లలు వదలడంతో ఎదుగదల లోపించేది. ఈ ఏడాది జూలైలో కురిసన వర్షాలకు జలాశయాలు నిండుగా ఉన్నాయి. ఆలస్యం చేయకుండా చేప పిల్లలు వదలాలని మత్స్యకారులు కోరుతున్నారు.

జూలైలో ప్రణాళిక..
మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా నీటి వసతి కలిగిన చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదిలేందుకు జూలైలో ప్రణాళిక సిద్ధం చేసింది. చేపపిల్లల సరఫరాకు ఆగస్టు 11న టెండర్లు పిలిచింది. 364 చెరువులు, కుంటలు, 6 పెద్ద ప్రాజెక్టులు, రెండు మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఈ ఏడాది చేప పిల్లలు వదలాలని నిర్ణయించారు. వీటిలో 2.20 కోట్ల చేప పిల్లలు వదలాలని మత్స్యశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎల్లంపల్లి, సుందిళ్ల ప్రాజెక్టులలో రొయ్య పిల్లలను కూడా పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈమేరకు నలుగురికి టెండర్లను డివైడ్ చేసి ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి చేప పిల్లలను తీసుకువచ్చి పంపిణీ చేయాలని సూచించింది. కానీ జలాశయాల్లో విడుదల తేదీలు మాత్రం ప్రకటించలేదు.

జిల్లాలో 117 మత్స్యకార సంఘాలు..
జిల్లాలో 117 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 6,542 మంది సభ్యులు ఉన్నారు. వీరికి ఉపాధి కల్పించేందుకు రహు, బొచ్చ, బంగారు తీగ, మ్రిగాల వంటి చేప పిల్లల ద్వారా 20 వేల టన్నుల చేపల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. 35 నుంచి 45 ఎం.ఎం సైజుగల చేపపిల్లలు 1.20 కోట్లు, 80 నుంచి 100 ఎం.ఎం సైజు గల చేపపిల్లలు 90 లక్షలు జలశయాల్లో వదలేందుకు ప్రణాళిక రూపొందించారు.

గతేడాది నాసిరకం పిల్లలు..

గతంలో చేప పిల్లల పంపిణీలో పలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. సకాలంలో పంపిణీ చేయకపోవడంతో ఎదుగుదల లేక మత్స్యకారులకు నష్టం వాటిల్లింది. నాణ్యత, పరిమాణం లేని చేప పిల్లలను వదిలి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. పలుచోట్ల చేప పిల్లల వదిలే కార్యక్రమాలను మత్స్యకారులు అడ్డుకున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మత్స్యశాఖ అధికారులు ఈ ఏడాది జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరిమాణంలో, నాణ్యతలో ప్రమాణాలు పాటించేలా కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.



వారం, పదిరోజుల్లో చేప పిల్లలు వదులుతాం..

చేపపిల్లల సరఫరాకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. నలుగురికి టెండర్లు ఇవ్వడం జరిగింది. జిల్లాలో 2.20 కోట్ల చేపపిల్లలను 371 జలాశయాల్లో వదిలేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి ఆదేశాల ప్రకారం పంపిణీ తేదీలు త్వరలో ప్రకటించి వారం పదిరోజుల్లో చేప పిల్లలను వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.
– సత్యనారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి

సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఖానాపూర్‌: వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంజాల వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సెక్యూరిటీ గార్డుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. జీవో 21ని వెంటనే అమలు చేయాలని, ఏకరూప దుస్తులు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు సంఘం ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీ చంటి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాడి గంగారాం, జీ పొచ్చన్న, నిర్మల్ అధ్యక్ష, కార్యదర్శులు షోయబ్ హుస్సేన్, బీ గంగాధర్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల అధ్యక్షుడు పీ రమేశ్, కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు షేక్ ఫహీం, కరిపె రాజేందర్, పోశెట్టి, జనార్దన్, వెంకన్న, రమేశ్, నిరంజన్ తదితరులున్నారు.

అపరాధ రుసుముతో 'ఓపెన్' ప్రవేశాలు

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు ఈ నెల 31వరకు అపరాధ రుసుముతో అవకాశం ఉందని దండేపల్లి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లచ్చయ్య, సహాయ కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. ప్రవేశాలు పొందేవారు, తమ ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, హార్డ్ కాపీలను అధ్యయన కేంద్రంలో అందించాలని వివరించారు. మరిన్ని వివరాలకు 8309769067, 9866110308 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఓట్లు మావి.. సీట్లు వాళ్లకా..?

- నేతకాని పోరాట హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్
- చెన్నూర్‌లో నేతకాని ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఐక్యత చాటిన నేతకాని కులస్తులు

చెన్నూర్‌: చెన్నూర్ నియోజకవర్గంలో ఎక్కువ ఓట్లు నేతకానీలవని, సీట్లు మాత్రం అన్ని పార్టీలు మాల మాదిగలకే కేటాయిస్తున్నాయని నేతకాని హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జనగాం నరేశ్ అన్నారు. స్థానిక విశ్వకర్మ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గోదారి రమేశ్ అధ్యక్షతన నేతకాని ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరేశ్ హాజరై మాట్లాడారు. నేతకానీలు విద్య, ఉద్యోగపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ముందుండాలన్నారు. నియోజకవర్గం ఏర్పడి 70 ఏళ్లు కావస్తున్నా నేతకానీ సామాజికవర్గానికి చెందినవారు ఎమ్మెల్యే కాకపోవడం బాధాకరమన్నారు. నాటి నుంచి నేటి వరకు మాల మాదిగలే ఎమ్మెల్యేలుగా ఉన్నారని పేర్కొన్నారు. నేతకానీలు ఐక్యంగా ఉండి రానున్న ఎన్నికల్లో నేతకానీని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ జుమ్మిడి గోపాల్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధం సిద్దార్థ రామ్మూర్తి, యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జె రాజ్‌కుమార్, అనపర్తి యువరాజ్, జాడి ప్రేమ్‌చంద్, దుర్గం సంతోష్, అశోక్, ఎన్నం కిరణ్, భాస్కర్, యేసయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి గాంధీ సినిమా ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్‌: స్వాతంత్య్ర సమరయోధుల జీవితగాధలతో బాలల్లో స్ఫూర్తి నింపేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో చదువుకునే బాలల కోసం గాంధీ సినిమా ప్రదర్శించేందుకు ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది స్వాతంత్య్ర దినోత్సవాల్లో భాగంగా ఆగస్టు 8నుంచి 22వ తేదీ వరకు గాంధీ చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఆయా థియేటర్లకు వెళ్లి చిన్నారులు చిత్రాన్ని వీక్షించారు. ఈసారి కూడా ఆగస్టు 14 నుంచి 24 వరకు సినిమా ప్రదర్శించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల 11, 12వ తరగతుల విద్యార్థినులు సమీప థియేటర్లలో సినిమా చూసేలా పాఠశాల నిర్వహకులు, విద్యాశాఖ, రవాణాశాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. స్వాతంత్ర సాధనలో మహనీయుల త్యాగాలు, గాంధీ అనుసరించి అహింసామార్గాంపై అవగాహన కల్పించేందుకు గాంధీ సినిమా ప్రదర్శించాలని నిర్ణయించారు.

జిల్లాలో మొత్తం పాఠశాలలు..
పాఠశాలలు - 1,046
మొత్తం విద్యార్థులు - 1,15,324
బాలురు - 59,986.
బాలికలు - 55,338

మొదటి రోజు...
మొదటి రోజు జిల్లా కేంద్రమైన మంచిర్యాల శ్రీనివాస(ఏషీయన్) సినిమా థియేటర్లలో లాంఛనంగా గాంధీ చిత్ర ప్రదర్శన జరుగనుంది. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గర్మిళ్ల హైస్కూల్‌కు చెందిన 900 మంది విద్యార్థులు సినిమా వీక్షించనున్నారని డీఈవో యాదయ్య తెలిపారు.

ప్రజలకు అండగా పోలీసులు

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి
- కర్ణపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం



గిరిజన మహిళలు అందించిన ఆకుల టోపీలు ధరించిన సీపీ రెమా రాజేశ్వరి, పోలీస్ అధికారులు

దండేపల్లి: పోలీస్ శాఖ ప్రజలకు నిరంతరం అండగా ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దండేపల్లి మండలం కర్ణపేట రైతు వేదిక వద్ద గిరిజనుల కోసం ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీపీ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గిరిజన గ్రామాల ప్రజలు సీజనల్ వ్యాధులబారిన పడకుండా ఉండేందుకు పోలీస్ శాఖ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంతో పాటు గిరిజనులకు బ్యాంకు లావాదేవీల గురించి, అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే వారు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలతోపాటు, లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు. అవసరం ఉన్నవారికి రాష్ట్ర రోడ్డు రవాణ శాఖ ఆధ్వర్యంలో అక్కడే స్లాట్ బుకింగ్ చేసి, లర్నింగ్ లైసెన్స్ జారీ చేశారు. అనంతరం గిరిజన మహిళలకు చీరలు, గిరిజనులకు దుప్పట్లు, చదువుకున్న యువతీ యువకులు, ఉద్యోగ పరీక్షలు రాసేందుకు స్టడీ మెటీరీయల్ పంపిణీ చేశారు. వైద్య పరీక్షలతోపాటు, అవసరమున్నవారికి ఉచితంగా మందులు అందించారు. 1,500 మందికిపైగా గిరిజనులు శిబిరానికి వచ్చారు. శిబిరానికి వచ్చిన వారందరికీ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ సుధీర్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐలు కృష్ణ, సంజీవ్, ఎస్సైలు ప్రసాద్, సతీశ్, లక్ష్మణ్, నరేశ్, రవికుమార్, ఇన్‌చార్జి ఆర్టీవో వివేకానందరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, పోలీస్, ఆర్టీఏ సిబ్బంది, మెడిలైఫ్ ఆసుపత్రి, దండేపల్లి, తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ..



శిబిరానికి హాజరైన గిరిజన మహిళలు

గిరిజన సంప్రదాయాలతో స్వాగతం..
వైద్యశిబిరానికి విచ్చేసిన సీపీ రెమా రాజేశ్వరికి గిరిజనులు వారి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. డోలు వాయిద్యాల చప్పుళ్లు, గుస్సాడీ నృత్యం చేశారు. పూల మాలలు వేసి, ఆకులతో ఏర్పాటు చేసిన టోపిని సీపీకీ అలంకరించారు. గిరిజనులు తనపై చూపించిన ఆదరాభిమానాలు మరువ లేనివని సీపీ పేర్కొన్నారు.

'బంధు' పేరిట మోసగిస్తున్న కేసీఆర్

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్‌: ఎన్నికలు వచ్చినప్పుడే సీఎం కేసీఆర్‌కు ప్రజలు గుర్తుకొస్తారని, అందుకే బంధు పేరిట పలు పథకాలను తీసుకొస్తూ మరోమారు మోసం చేయాలని చూస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ప్రజాగాయకుడు గద్దర్‌కు ఆదివారం నివాళులర్పించారు. అనంతరం ముల్కల్ల గ్రామానికి చెందిన గడ్డం సతీశ్ ఆధ్వర్యంలో 250 మంది, పట్టణంలోని పలు వార్డులకు చెందిన 150 మందిని కాంగ్రెస్‌లో చేరగా, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేసీఆర్ విఫలమయ్యారని అన్నారు. రైతుబంధు పేరిట ఎకరానికి ఇచ్చే సాయాన్ని ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఐదు కిలోల వరకు కోత విధించి తిరిగి దోచుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఏటా రుణాలను అందించి, వారికి ఉపాధి కల్పించేదని, ఇప్పుడు రుణాల ఊసే లేకుండా చేసి, ఎన్నికల సమయంలో బీసీబంధు పేరిట రూ.లక్ష సాయం అంటున్నారని వివరించారు. ఎమ్మెల్యేలు చెప్పిన వారికే సాయం చేస్తున్నారని తెలిపారు. ఇక ఇంటి స్థలం ఉన్నవారికి రూ.3 లక్షల అందించే గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు కేవలం మూడు రోజులు సమయం ఇచ్చారని పేర్కొన్నారు. వైన్స్ టెండర్లకు మాత్రం 15 రోజుల సమయాన్ని ఇచ్చారని చెప్పారు. పేదల సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పిన కేసీఆర్ దానిని నెరవేర్చలేదని తెలిపారు. ఇక దళితబంధులో 30 శాతం ఎమ్మెల్యేలు కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మంచిర్యాల పట్టణంలోని పలు కాలనీలు నీటమునుగుతుంటే.. వరద రాకుండా చర్యలు తీసుకోకుండా.. అక్కడ ఇళ్లు ఎందుకు కట్టుకున్నారంటూ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఎదురు ప్రశ్నించడం సరికాదన్నారు. సమావేశంలో చిట్ల సత్యనారాయణ, పూదరి ప్రభాకర్, తూమలు నరేశ్, కొండ చంద్రశేఖర్, ఒడ్డె రాజమౌళి, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు వేములపల్లి సంజీవ్, మాజిద్, గజ్జల హేమలత పాల్గొన్నారు.



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

హడావుడిగా కేజీబీవీ నియామకాలు

మంచిర్యాలఅర్బన్‌: కేజీబీవీ, యూఆర్ఎస్‌లో కాంట్రాక్టు పోస్టుల భర్తీ హడావుడిగా పూర్తయింది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నుంచి సెల్ఫ్ రిపోర్టింగ్ వరకు అంతా నాలుగు రోజుల్లోనే పూర్తి చేశారు. ఆదివారం జాబ్‌లో జాయిన్ కావాలంటూ ఎస్ఎస్ఏ ఎస్పీడీ శ్రీదేవసేన అదేశాలిచ్చారు. ఈమేరకు జిల్లా విద్యశాఖ కార్యాలయంలో 27 మందికి డీఈవో యాదయ్య చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. నియామకపత్రాలు అందుకున్న ఉద్యోగులు ఆయా విద్యాలయాలకు వెళ్లి రిపోర్టింగ్ చేయాలి. కానీ స్పెషల్ ఆఫీసర్లను కార్యాలయానికే పిలిపించి జాబ్‌లో జాయిన్ చేయించటం చర్చనీయాంశంగా మారింది. జాబ్‌లో జాయిన్ అయ్యేందుకు వచ్చిన అభ్యర్థులతోపాటు కుటుంబసభ్యులు వెంటరావటంతో ఆదివారం డీఈవో కార్యాలయంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి హేమలత, చౌదరి, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎన్నో అనుమానాలు..
ఇదిలా ఉంటే నియామక ప్రక్రియపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాల విద్యాశాఖలో సమగ్ర శిక్ష అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం సాయంత్రం పరీక్ష ఫలితాలను విడుదల చేసి, శుక్రవారం ఉదయం 10 గంటలకే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు రావాలంటూ అధికారులు ఆదేశాలు జారీచేశారు. వచ్చిన వాళ్లతో ఆ ప్రక్రియను మమ అనిపించి, శనివారం తుది జాబితాను ప్రకటించారు. ఆయా పోస్టులకు ఎంపికైన వారు ఆదివారం సాయంత్రం ఐదు గంటల్లోపు చేరాలంటూ ఆదేశాలిచ్చారు. అసలు ఫలితాలను సరిగ్గా చూసుకోకముందే రెండ్రోజుల్లోనే అదీ సెలవు దినాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తుండడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎంపికైన కొంతమంది అభ్యర్థులు ఆదివారం గురుకుల పరీక్ష రాసేందుకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం విధుల్లో చేరాలని ఆదేశాలు అందడంతో బంధువులు కార్యాలయానికి వచ్చారు. తాము సంతకం చేస్తామని చెప్పారు. కానీ అందుకు ఎస్‌వోలు అంగీకరించలేదు.



ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తున్న డీఈవో యాదయ్య

క్లుప్తంగా

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు


చికిత్స పొందుతున్న సాంబయ్య

బెజ్జూర్(సిర్పూర్): అడవిపంది దాడిలో ఒకరు గాయాలపాలైన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన మేస్తం సాంబయ్య పంటచేనుకు వెళ్లి వస్తుండగా గొల్లబాయి చెరువు సమీపంలో అడవిపంది దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో అడవిపంది పారిపోయింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

అపూర్వ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో ఉన్న సింగరేణి ఉన్నత పాఠశాలలో 1988–89 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగిన సమ్మేళనంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా పాల్గొన్నారు. దుబాయ్‌లో ఉంటున్న చలుమూరి సతీష్ అనే పూర్వ విద్యార్థి స్వగ్రామానికి రావడంతో పూర్వ విద్యార్థులంతా ఒకేచోట కలుసుకోవడానికి కార్యక్రమం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సుమన్

చెన్నూర్: తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో చెన్నూర్ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసోజు శ్రావణ్, సోషల్ ట్రైనర్స్ సత్యప్రసాద్, రవీందర్, విజయానంద్ పాల్గొన్నారు.

అడ్డొస్తున్నారని అంతం!

జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడకు చెందిన బత్తిని శరణ్య(27)ను సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జియాఉల్‌హక్ 2012లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. దంపతులకు ఒక పాప సంతానం. కొంతకాలం తర్వాత జియాఉల్‌హక్ మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకుని శరణ్యకు దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో భర్తపై కేసు పెట్టింది. దీంతో ఆమె భర్త విడాకులు కావాలని కోరడంతో నిరాకరించింది. దీంతో భర్తే ఈ నెల 10న హత్య చేయించాడని శరణ్య కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

మానవత్వం మంటగలుస్తోంది.. మానవ సంబంధాలు 'మనీ' చుట్టూ తిరుగుతున్నాయి. ఆస్తి కోసం క్షణికావేశంలో అయిన వారినే కడతేరుస్తున్నారు. కన్నోళ్లు, కట్టుకున్నోళ్లు, తోడబుట్టిన వారిని పొట్టన పెట్టుకుంటున్నారు. అనుమానంతో ఒకరు..వివాహేతర సంబంధంలో మరొకరు... పాత కక్షలతో ఇంకొకరు... ప్రేమ వ్యవహారం.. ఆస్తి తగాదాలు.. కారణాలు ఏమైనా కావచ్చు. అంతిమంగా మనిషి మృగంలా మారుతున్నాడు. మానవ విలువలకు తిలోదకాలిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు పది హత్యల వరకు జరిగాయి.

- జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న వరుస హత్యలు
- విచ్ఛిన్నమవుతున్న ఆత్మీయ బంధాలు
- ఆస్తి తగదాలు, వివాహేతర సంబంధాలే కారణం..
- క్షణికావేశంలో గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు


శరణ్య హత్యకేసులో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

మంచిర్యాలక్రైం:జిల్లాలో ఇటీవల జరిగిన వరుస హత్యలు ప్రజల్లో భయాందోళన కలిగిస్తున్నాయి. క్షణికావేశంలో కొందరు.. పాత కక్షలతో మరికొందరు.. మనీ కోసం ఇంకొందరు.. హత్యలకు పాల్పడుతున్నారు. ఒకచోట రక్తపు మరకలు చెదిరిపోకముందే మరోచోట రక్తం ఏరులై పారుతోంది. ఒకచోట వివాహేతర సంబంధంతో ప్రియునితో కలిసి భర్తను హత్య చేయించగా మరోచోట భార్యను భర్త అంతమొందించాడు. ఇంకోచోట ఆస్తి వివాదంలో రియల్ ఎస్టేట్ వ్యాపారికి నమ్మినబంటే నరికి చంపేశాడు. దీంతో చనిపోయిన వారి కుటుంబాలే కాకుండా హత్యలకు పాల్పడిన వారి కుటుంబాలు కూడా ఛిన్నాభిన్నం అవుతున్నాయి. అంతేకాకుండా జిల్లాలో ఇటీవల సుపారీ హత్యలు పెరిగిపోయాయి. రాజకీయ నాయకుల అండదండలు.. చట్టాలు కఠినంగా లేకపోవడమే ప్రధాన కారణమని మేధావివర్గం భావిస్తోంది. ఇలా హత్యలు చేసి అలా బెయిల్‌పై బయటకు వచ్చి దర్జాగా తిరుగుతుండడం పరిపాటిగా మారింది. కొన్నాళ్లకు హత్య కేసులో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసులు కొట్టుడుపోవడం, కొన్ని కేసుల్లో శిక్షలు పడడం జరుగుతోంది.

జిల్లాలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు

- తాండూర్ మండలంలోని అచ్చులాపూర్‌కు చెందిన సిద్దం శ్రీనివాస్ (40) భార్య బానక్క తాండూర్‌కు చెందిన మేడి శంకర్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. విషయం భర్తకు తెలియడంతో పలుమార్లు మందలించాడు. దీంతో తమ వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ఈ నెల 9న బానక్క ప్రియునితో కలిసి హత్య చేయించింది. తాండూర్ పోలీసులు 24గంటల్లో హంతకులను పట్టుకున్నారు.
- మంచిర్యాలకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నడిపెల్లి లక్ష్మీకాంతారావు (63)కు నమ్మకంగా ఉండే మామిడి శ్రీనివాస్‌కు మధ్య రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి సమీపంలో ఉన్న స్థిరాస్తి విషయంలో వివాదం తలెత్తింది. దీంతో లక్ష్మీకాంతారావ్‌ను అడ్డు తొలగించుకోవాలనుకున్న శ్రీనివాస్ ఈ ఏడాది ఏప్రిల్ 11న పథకం ప్రకారం హత్య చేశాడు.

చట్టాల అమలులో విఫలం



చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. నేరాలకు పాల్పడిన వారిని కాపాడడంలో రాజకీయ నాయకుల ప్రోద్బలం ఎక్కువైంది. పోలీసులు కేసుకు సంబంధించిన విచారణలో పారదర్శకత చూపించినప్పటికీ కొన్ని కేసుల్లో రాజకీయ నాయకుల ఒత్తిడికి గురవుతున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల్లో పోలీస్ అంటే భయం పోయినందవల్లే నేరాలు పెరుగుతున్నాయి.

– తుల మధుసూదన్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, మంచిర్యాల

చట్టాలపై అవగాహన లేకనే..



చట్టాలపై అవగాహన లేకనే నేరాలు పెరుగుతున్నాయి. నేరం చేస్తే శిక్షలు ఉంటాయనే విచక్షణ జ్ఞానం కోల్పోతున్నారు. నేరానికి పాల్పడితే జరిగే పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. నేరం చేసిన వారికి కచ్చితంగా శిక్ష పడేలా చూడాలి. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలి. నేరస్తులను కాపాడేందుకు ఎవరూ సాహసం చేయకూడదు. నేర ప్రవృత్తిని నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలి.– పులి రాజమల్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, మంచిర్యాల

క్వార్టర్‌ను పరిశీలించిన ఎస్టేట్స్ జీఎం

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: ఈ నెల 10న 'సాక్షి'లో ప్రచురితమైన 'కబ్జాదారుల చేతుల్లోకి క్వార్టర్లు' అనే కథనానికి సింగరేణి యాజమాన్యం స్పందించింది. మందమర్రి ఏరియా మొదటి జోన్‌లో క్వార్టర్(491)ను కూల్చివేసి అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని ఆదివారం సింగరేణి ఎస్టేట్స్ జీఎం సురేష్ పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. కాగా ఈ విషయాన్ని అధికారులు అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు.

ఫుట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి మెన్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా ప్రతిభ కనబర్చిన 20 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 16 నుండి 20 వరకు వనపర్తి జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు పాల్గొంటుందని ఆయన పేర్కొన్నారు.

గిరిజనులకు అందని స్వాతంత్య్ర ఫలాలు

- గిరిజన సంఘం రాష్ట్ర నాయకురాలు లక్ష్మి


మాట్లాడుతున్న ఎరుగటి లక్ష్మి

నెన్నెల(బెల్లంపల్లి): స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్నా గిరిజనుల బతుకులు మారడంలేదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకురాలు ఎరుగటి లక్ష్మి అన్నారు. ఆదివారం కోనంపేట పంచాయతీ పరిధిలోని పాటి గ్రామంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం కురిస్తే పాటి గ్రామస్తులు జలదిగ్బంధంలో చిక్కుకుని బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారన్నారు. ఇటీవల రెడ్డి మల్లక్క అనే గర్భిణి దారి లేక ఆస్పత్రికి వెళ్లేందుకు అరిగోస పడిందని గుర్తుచేశారు. విద్య, వైద్యం, రవాణా, తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతులు లేక గిరిజనులు దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై పాలకులు హామీలు ఇవ్వడం తప్పా శ్రద్ధ పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులు మాట్లాడుతూ తమ గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించకపోతే రానున్న ఎన్నికల్లో ఓటు వేయమని స్పష్టం చేశారు. ఆస్పత్రికి వెళ్లాలంటే పొలం గట్లపై నుంచి బురదలో మూడు కిలోమీటర్లు కాలినడకన వచ్చి ఎడ్లబండిపై మండల కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకొని కనీసం రోడ్డు సౌకర్యం కల్పించి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో మారయ్య, చిన్నయ్య, మమత , సరోజ, పద్మ, మాధవి పాల్గొన్నారు.

'బీసీ గర్జన పేరిట కాంగ్రెస్ మోసం'


మాట్లాడుతున్న చంద్రయ్య

జన్నారం: ఇంతకాలం బీసీలను పట్టించుకోని కాంగ్రెస్ బీసీ గర్జన పేరిట బీసీలను మోసం చేయడానికి మరోసారి కుట్ర పన్నుతోందని బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నిర్వహిస్తున్న బీసీ గర్జన కార్యక్రమాన్ని సమితి బహిష్కరిస్తుందన్నారు. 75 సంవత్సరాల కాలంలో ఏనాడు బీసీలను పట్టించుకోని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో బీసీ భజన చేయడం విడ్డూరమన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే విషయంలో కాంగ్రెస్ మాట్లాడకపోవడం సరికాదన్నారు. సమావేశంలో గంగాధర్, భాస్కర్‌గౌడ్, శ్రీనివాసగౌడ్, ఎంబడి సత్తన్న, నర్సగౌడ్, సురేశ్, రాజన్న, మల్లయ్య, లెక్కల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అట్టహాసంగా గ్రాడ్యుయేషన్ డే


ప్రతిజ్ఞ చేస్తున్న మెడికోలు

- ఎంబీబీఎస్ పూర్తి చేసిన మెడికోలకు సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లు అందజేస్తున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్: రిమ్స్‌లో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే అట్టహాసంగా జరిగింది. మెడికోల కేరింతలు, చప్పట్ల మధ్య రిమ్స్‌లో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఇటీవల వాగులోపడి మృతి చెందిన పీజీ వైద్యవిద్యార్థి భూక్య ప్రవీణ్ కుమార్ మృతి పట్ల సంతాపం ప్రకటించారు. అనంతరం వైద్యకోర్సు పూర్తి చేసిన 2017 బ్యాచ్ మెడికో విద్యార్థులకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుడిగా మంచి గుర్తింపు తెచ్చుకొని పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం పట్టాలు పొందిన మెడికోలు వైద్యవృత్తికి న్యాయం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇద్రిస్ అక్బాని, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విద్యవిల్సన్, ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యులు, మెడికోలు పాల్గొన్నారు.

కూలిన కంపెనీ క్వార్టర్ పైకప్పు


కూలిన పైకప్పు

రామకృష్ణాపూర్(చెన్నూర్): బీజోన్ ఏరియాలోని సింగరేణి బీ–21 క్వార్టర్స్‌లో ఉన్నట్టుండి ఒక్కసారిగా పైకప్పు కూలింది. ఆర్కే ఓసీలో అండర్ మేనేజర్‌గా పనిచేస్తున్న రవికిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా ఈ క్వార్టర్‌లోని బెడ్ రూంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. అప్పటివరకు అదే గదిలో ఉన్న కుటుంబసభ్యులు అప్పుడే వేరే గదికి వెళ్లడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. గదిలోని కంప్యూటర్‌తో పాటు ఇతర సామగ్రి ధ్వంసమైంది. విషయం తెలిసిన వెంటనే ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, ఇతర సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు క్వార్టర్‌ను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతి

- అడ ప్రాజెక్టు వద్ద మృతదేహం గుర్తింపు
- న్యాయం చేయాలని బంధువుల రాస్తారోకో


సుధాకర్ (ఫైల్)


రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆటోడ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలోని అంకుసాపూర్‌లో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అంకుసాపూర్ గ్రామానికి చెందిన పోల్కర్ సుధాకర్ (45) ఆటో పాయింట్ వద్ద క్రమపద్ధతిలో ఆటోలను పంపించేవాడు. గత శుక్రవారం తోటి ఆటో డ్రైవర్లు సాయి, జహంగీర్‌తో కలిసి రెబ్బెన మండలం ఖైర్‌గాంలో ఇటీవల మృతి చెందిన మరో ఆటోడ్రైవర్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గుండి రహదారిలో, చిర్రకుంట రహదారిలో ఉన్న వైన్సుల వద్ద మద్యం సేవించారు. అక్కడి నుంచి ఆటోలో బయలుదేరినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం వరకు సుధాకర్ ఇంటికి రాకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం అడ ప్రాజెక్టు వద్ద గుర్తు తెలియని మృతదేహం కనిపించినట్లు మేకల కాపరులు తెలపడంతో పోలీసులతో కలిసి ప్రాజెక్టు వద్దకు వెళ్లగా సుధాకర్ నీటిలో తేలియాడుతూ కనిపించాడు. మృతదేహంపై కత్తిపోట్లు ఉండడంతో ఎవరో కావాలనే హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతునికి భార్య సుజాత, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

కుటుంబ సభ్యుల రాస్తారోకో...

సుధాకర్‌ను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ సురేష్ నిందితులను అరెస్టు చేసి శిక్ష పడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగులు వీరే

- ఉత్తమ సింగరేణియన్లుగా ఎంపికైన శ్రీనివాస్, రమేశ్, తిరుపతి


విత్తనాల రమేశ్


పల్లెర్ల తిరుపతి

మందమర్రిరూరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థ ఏరియాలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసింది. ఏరియా జీఎం మోహన్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. ఉత్తమ సింగరేణియన్‌గా విత్తనాల రమేశ్ (ఈపీ ఆపరేటర్, ఆర్కే ఓసీ) ఎంపికకాగా గుత్తుల రామ్మోహన్‌రావు ఎలక్ట్రీషియన్, గుండమల్ల పుష్పరాజు (ఈపీ ఆపరేటర్, ఆర్కే ఓసీ), తోట శ్రీనివాస్ ఫిట్టర్, అబ్బోజి రాజేశం (కేకే–ఓసీ), రాంటెంకి బానయ్య, కోల్‌కట్టర్, కే.భాస్కర్, జనరల్ మజ్దూర్ (కాసిపేట), మోతుకుల వెంకటేశ్, ఎలక్ట్రీషియన్, అడప లక్ష్మీనారాయణ, జనరల్ మజ్దూర్ (కాసిపేట–2), పెద్దపల్లి రాజయ్య, సీనియర్ మైనింగ్ సర్దార్, వనం రవీందర్ సీనియర్ మైనింగ్ సర్దార్ (శాంతిఖని) చిలువేరు రవి, కోల్‌కట్టర్, చెలిమెల తిరుపతి, ట్రామర్ (కేకే–5) ఊడెం రఘుపతి, కోల్‌కట్టర్, మిడివెల్లి రమేశ్, ఎస్డీఎల్ ఆపరేటర్ (ఆర్కే–1ఏ) కే.కృష్ణకిశోర్, ఎలక్ట్రీషియన్ (ఆర్కేపీ, సీహెచ్‌పీ) ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారు.

శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్తమ ఉద్యోగులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఉత్తమ సింగరేణియన్‌గా పల్లెర్ల తిరుపతి, (ఆర్కే 7, ఎస్డీఎల్ ఆపరేటర్) ఎంపికయ్యారు. గనుల వారీగా కోమటిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి (కోల్‌కట్టర్, ఆర్కే 5), చిట్ల కొమురయ్య, (జనరల్ మజ్దూర్, ఆర్కే 5), మల్యాల మోహన్ పటేల్ (ఫోర్‌మెన్, ఆర్కే 6), కోడె అనిల్ కుమార్ (సీనియర్ మైనింగ్ సర్దార్ ఆర్కే 6), మారెపల్లి సారయ్య (ఎస్డీఎల్ ఆపరేటర్, ఆర్కే 7), ఎనగందుల బాబు, (సపోర్ట్‌మెన్ ఆర్కే 7), కర్ణె వెంకటేశం (ఫోర్‌మెన్, ఆర్కే న్యూటెక్), రామచంద్రం, (సీనియర్ మైనింగ్ సర్దార్, ఆర్కే న్యూటెక్), పెండ్యాల కొమురయ్య, (ఎస్డీఎల్ ఆపరేటర్ ఎస్సార్పీ1), అశోక్(ఫిట్టర్, ఎస్సార్పీ 1). రిక్కల గోపాల్, (సీనియర్ మైనింగ్ సర్దార్, ఎస్సార్పీ3 అండ్ 3ఏ), దుగుట సాంబయ్య, (ఎస్డీఎల్ ఆపరేటర్ ఎస్సార్పీ 3 అండ్ 3ఏ), పోశం అనంతయ్య (హెల్పర్, ఐకే 1ఏ), ఎం. మధుకర్,(కోల్‌కట్టర్ ఐకే 1ఏ), కొండ వెంకటేశ్, (ఎంవి డ్రైవర్ ఐకే ఓసీపీ), ధర్ని దేవేందర్, (ఈపీ ఆపరేటర్, ఐకే ఓసీపీ), దక్షిణమూర్తి (ఈపీ ఆపరేటర్, ఎస్సార్పీ ఓసీపీ), గొట్టెముక్కుల రమేశ్, (ఫిట్టర్, ఎస్సార్పీ ఓసీపీ), కాసారపు లక్ష్మయ్య, (ఫిట్టర్, ఎస్సార్పీ సీహెచ్‌పీ) ఎంపికయ్యారు.

బీపీఏలో ఉత్తమ కార్మికులు


రామగిరి శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ తెలిపారు. ఉత్తమ సింగరేణియన్‌గా గోలేటి సీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తున్న రామగిరి శ్రీనివాస్ ఎంపికైనట్లు తెలిపారు. ఉత్తమ ఉద్యోగులుగా దాసరి భిక్షపతిగౌడ్ (జనరల్ మజ్దూర్, ఖైరీగూడ ఓసీపీ), గంద్రాతి రమేశ్ (హెడ్ ఓవర్ మెన్), నరేశ్ (ఓసీ 2), ఎస్ శ్రీపాల్ (సర్వేమజ్దూర్) దుర్గం బాపు (గోలేటి సీహెచ్‌పీ)ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.100 ఇస్తేనే డ్రెస్సింగ్


ఆస్పత్రిలో సిబ్బందికి తెలుపుతున్న బాధితుడు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్తే అవుట్ సోర్సింగ్ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారని బాధితుడు తుల సీరాం చేసిన ఆరోపణలు ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం చేతికి గాయమైందని ఆస్పత్రికి వెళ్తే పేషెంట్ కేర్ టేకర్‌గా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఒకరు రూ.100 ఇస్తేనే డ్రెస్సింగ్ చేస్తానని డబ్బులు డిమాండ్ చేసిందన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన పేషెంట్ కేర్ టేకర్‌ను విధుల నుంచి తొలగించినట్లు వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆస్పత్రిలో రోగుల వద్ద డబ్బులు తీసుకున్నా అడిగినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మంచిర్యాలక్రైం: మణిపూర్ ఘటనను నిరసిస్తూ పట్టణంలో ఆదివారం క్రైస్తవులు భారీ శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత గురువులు మాట్లాడుతూ మణిపూర్‌లోని మహిళలపై జరిగిన దాడి యావత్ ప్రపంచం తలదించుకునేలా ఉందని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవులను అతి కిరాతకంగా హత్య చేస్తూ క్రైస్తవ మందిరాలను తగలబెట్టడం హేయమైన చర్య అన్నారు. ఈ దాడులకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అల్లర్లు ఆగిపోయి మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫ్రాన్సిస్ సుకుమార్, శ్రీకాంత్, పాల్‌విగ్, పాస్టర్స్ ఎస్.డేవిడ్ పాల్, స్వామిదాస్, రవిజోషఫ్, అశోక్, జాషువా, స్టాలిన్, యేసుదాస్, సురేష్, కమలాకర్, జిల్లాలోని అన్ని డినామినేన్ల పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.